దెబ్బతిన్న లంక గ్రామాల రోడ్లు

- వరదకు కొట్టుకుపోయిన బ్లాక్ టాప్
- ప్రయాణికులకు ఇబ్బందులు

మామిడికుదురు: గోదావరి వరదకు రోడ్లు దారుణంగా దెబ్బతిన్నాయి. రోడ్లపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో పాటు బ్లాక్‌టాప్ కొట్టుకుపోయి మెటల్ లేచిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాశర్లపూడి ఏటిగట్టు దిగువన ఉన్న అప్పనపల్లి కాజ్‌వే వద్ద రోడ్డు లేచిపోయింది. బ్లాక్ టాప్ కొట్టుకు పోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బి.దొడ్డవరం రొయ్యల చెరువుల వద్ద నుంచి వినాయక ఆలయం సమీపాన రోడ్డు పరిస్థితి చాలా దారుణంగా ఉంది. జూలై నెలలో వచ్చిన వరదకు దెబ్బతిన్న రోడ్లు రెండో దఫా వచ్చిన వరదకు మరింతగా పాడైపోయాయి. పెదపట్నం


వరద ఉధృతికి కొట్టుకుపోయిన బి.దొడ్డవరం రోడ్డు


ప్రవాహానికి కొట్టుకుపోయిన పెదపట్నం రోడ్డు

రత్నాపురం నుంచి శివాలయం వరకు ఉన్న ప్రధాన రోడ్డు కూడా వరదకు కొట్టుకు పోయింది. దీంతో పాటు అప్పనపల్లి కొర్లగుంట నుంచి మొల్లేటివారిపాలెం వరకు సిమెంట్ కాంక్రీట్ రోడ్డుకు రెండు వైపులా వేసిన బెర్మలు కొట్టుకుపోయి రోడ్డు పరిస్థితి దారుణంగా మారింది. బెర్మలతో పాటు సీసీ రోడ్ల కింది భాగంలో ఖాళీ ఏర్పడింది. దీంతో సీసీ రోడ్లు ముక్కలు, ముక్కలుగా విరిగి పోయే ప్రమాదం పొంచి ఉందని ఈ రోడ్లకు తక్షణం మరమ్మతులు నిర్వహించని పక్షంలో సీసీ రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యే పరిస్థితి ఉందని స్థానికులు వాపోతున్నారు.. గోదావరి వరదకు దెబ్బతిన్న రోడ్లను తక్షణం పునర్నిర్మించడంతో పాటు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టాలని లంక గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పాడైన రోడ్లను అభివృద్ధి చేయాలి



గోదావరి వరదకు రోడ్లు దారుణంగా దెబ్బతిన్నాయి. రెండు సార్లు వరద రావడంతో రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. పాశర్లపూడి ఏటిగట్టు నుంచి బి.దొడ్డవరం వెళ్లే రోడ్డుపై ప్రయాణం చేయాలంటేనే భయంగా ఉంది. అసలే అధ్వాన్నంగా ఉన్న రోడ్లు వరదకు మరింత దారుణంగా తయారయ్యాయి. పాడైపోయిన రోడ్లకు కనీస మరమ్మత్తులైనా నిర్వహించాలి. తక్షణం దీనిపై అధికారులు దృష్టి సారించాలి. ప్రజా ప్రతినిధులు కూడా దీనిపై దృష్టి పెట్టాలి.

– మంచెం రామకృష్ణ, బి.దొడ్డవరం

రోడ్ల పరిస్థితి అధ్వానం



గోదావరి వరదలతో లంక గ్రామాల్లో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. గోదావరి వరదతో రోడ్లు ధ్వంసమై కొట్టుకుపోయాయి. పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. అధ్వానంగా మారిన రోడ్లపై ప్రయాణం చేసేందుకు ఇబ్బందులు పడుతున్నాం. పాశర్లపూడి ఏటిగట్టు నుంచి బి.దొడ్డవరం మీదుగా పెదపట్నంలంక వచ్చే రోడ్లు పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది. ఆర్అండ్‌బీ శాఖకు చెందిన ఈ రోడ్డును తక్షణం ఆధునీకరించాలి. తక్షణం రిపేర్లు నిర్వహించాలి. ఈ రోడ్డుపై ఎంతో మంది ప్రమాదాల బారిన పడుతున్నారు.

– బొరుసు నాగేశ్వరరావు, పెదపట్నంలంక

బెర్మలు పునరుద్ధరించండి



మామిడికుదురు శివారు కొర్లగుంట ఏటిగట్టు దిగువ నుంచి అప్పనపల్లి మొల్లేటివారిపాలెం వరకు ఉన్న సిమెంట్ కాంక్రీట్ రోడ్డుకు రెండు వైపులా బెర్మలు గోదావరి వరదకు పూర్తిగా కొట్టుకుపోయాయి. రెండు పర్యాలు వచ్చిన వరద ఉధృతికి బెర్మలు కొట్టుకు పోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. బెర్మలను పునరుద్ధరించని పక్షంలో సీసీ రోడ్డు విరిగిపోయే ప్రమాదం ఉంది. దీనిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించి కొట్టుకు పోయిన బెర్మలను పునరుద్ధరించాలి.

– గెద్దం గంగాధర్, అప్పనపల్లి

క్లుప్తంగా

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం


బాధితుడికి సాయం అందజేస్తున్న కాశీఅన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: రెండు కిడ్నీలు పాడైపోయి అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడి వైద్యానికి బుధవారం స్థానిక కాశీఅన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.20 వేల నగదు సాయం అందజేశారు. కపిలేశ్వరపురం మండలం అద్దంకివారిలంక గ్రామానికి చెందిన మానేపల్లి కార్తీక్ వయస్సు 20 సంవత్సరాలు స్థానిక డిగ్రీ కాలేజీలో ద్వితీయ సంవత్సరం బీఎస్సీ చదువుతున్నాడు. కార్తీక్‌కి రెండు కిడ్నీలు పాడైపోయి కిడ్నీ మార్పిడి చేయాలని వైద్యులు తెలిపారు. హోటల్‌లో పని చేసే కార్తీక్ తండ్రికి అంత స్తోమత లేకపోవడంతో కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరడంతో సంస్థ సభ్యుల చేతుల మీదుగా కార్తీక్‌కు రూ.20 వేల నగదు అందజేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


బి.దొడ్డవరంలో బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్

మామిడికుదురు: మోటార్ సైకిల్‌ను ట్రాక్టర్ ఢీ కొట్టిన సంఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. బి.దొడ్డవరం బొలిశెట్టివారిపాలెం వంగవీటి మోహనరంగా విగ్రహం ఎదుట బుధవారం ఈ ప్రమాదం జరిగింది. అప్పనపల్లి వైపు వెళ్తున్న బైకును ఎదురుగా బి.దొడ్డవరం వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టింది. ట్రాక్టర్ బైక్‌ను ఢీ కొట్టి, రోడ్డు పక్కన ఉన్న ప్రహరీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ చక్రం విరిగిపోగా, బైక్‌తో పాటు ప్రహరీ ధ్వంసమయ్యాయి. బైక్‌పై వెళ్తున్న కటికిరెడ్డి ప్రసాద్, అతని కుమారుడు సాయి గాయపడ్డారు. గాయపడిన ఇద్దరిని స్థానికులు అమలాపురం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బైక్‌పై ప్రయాణిస్తున్న వారు గాయాలతో బయట పడడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. త్రుటిలో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

శంకరరావు మృతి కళా రంగానికి తీరని లోటు


శంకరరావుకు కళాకారుల నివాళి

మామిడికుదురు: కోనసీమ వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి వాసంశెట్టి శంకరరావు మృతి కళా రంగానికి తీరని లోటని పలువురు వక్తలు ప్రస్తుతించారు. శంకరరావు సంతాప సభ బుధవారం ఆయన స్వగృహం వద్ద జరిగింది. అప్పనపల్లి బాల బాలాజీ దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుడిగా, రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘం శాంతి కమిటీ సభ్యుడిగా ఎన్నో పదవులను శంకరరావు అధిష్టించి ప్రజల్లో మంచి గుర్తింపు పొందారని కళాకారుల సంక్షేమ సంఘం నేత మంగం సత్యనారాయణ పేర్కొన్నారు. కార్యక్రమంలో యాలి శ్రీనివాస్, అడబాల సత్యనారాయణ, నయినాల కృష్ణారావు, వర్ధినేని బాబ్జి, చుట్టుగుళ్ల కిశోర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలును వివరిస్తున్నాం

అంబాజీపేట: వంద రోజుల ఎన్డీఏ పాలనలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసినవి వివరిస్తున్నట్లు పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేట మార్కెట్ యార్డు ఆవరణలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అధ్యక్షతన బుధవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ ఛైర్మన్ నామన రాంబాబు, దాసరి వీవీ సత్యనారాయణ, గణపతి వీరరాఘవులు, కొర్లపాటి గోపి తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

మలికిపురం: మండలంలోని గుడిమెళ్లంక వంతెన దగ్గర నుంచి మలికిపురం వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. తిరుమల ఆలయం లడ్డూ ప్రసాదంలో జరిగిన కల్తీపై వేలాది హిందువులు, విద్యార్థి సంఘాలు, వ్యాపార వర్తక సంఘాలు పాల్గొన్నాయి. ర్యాలీగా తరలివచ్చి నిరసన తెలియజేస్తూ వేంకటేశ్వరస్వామికి క్షమాపణ చెప్పారు. అనంతరం కల్తీ లడ్డూ వ్యవహారంలో ఎవరైతే దోషులు ఉన్నారో వారందరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పాల్గొనగా రాజోలు హిందూ పరిరక్షణ సమితి సమక్షంలో పోలిశెట్టి గణేష్, మండెల బాబి నాయుడు, మేడిచర్ల మెహర్, బల్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా కూటమి ధర్నా

మామిడికుదురు: పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు వ్యతిరేకంగా కూటమి నేతలు బుధవారం మామిడికుదురులో ధర్నా చేశారు. మగటపల్లిలో వైఎస్సార్ సీపీ నేతలకు రాజప్ప కొమ్ము కాస్తున్నారని ఆరోపిస్తూ మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. రాజప్ప రాజీనామా చేయాలని కూటమి నేతలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ప్రభుత్వ భూమిలో 30 ఏళ్ల నుంచి బడ్డీ పెట్టుకుని ఉపాధి పొందుతున్న కూటమి వ్యక్తికి వ్యతిరేకంగా రాజప్ప వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడికి రాజప్ప వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ధర్నా అనంతరం మండల రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. ధర్నాలో నామన రాజనర్సింహారావు, గోగి గోపాలకృష్ణ, నామన నాగేశ్వరరావు, బొంతు మణిరాజు, యాలంగి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


మామిడికుదురులో ధర్నా చేస్తున్న కూటమి నేతలు

అప్పనరామునిలంకలో స్వచ్ఛతాహి సేవ

సఖినేటిపల్లి: అప్పనరామునిలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం రామరాజులంక చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, ఎంపీపీ వీరా మల్లిబాబు మొక్కలను నాటారు. పాఠశాల ఎస్ఎంసీ ఛైర్మన్ దొంగ నాగలక్ష్మి, బ్యాంకు బ్రాంచి మేనేజర్ శివరామిరెడ్డి, బ్యాంకు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


అప్పనరామునిలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్క నాటిన సర్పంచ్ సుబ్బరాజు

మండల స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

సఖినేటిపల్లి: అప్పనరామునిలంక జెడ్పీ స్కూల్ విద్యార్థులు 17 మంది కబడ్డీ, చెస్, బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీల్లో గెలుపొంది, నియోజకవర్గ స్థాయి పోటీలకు ఏడుగురు అర్హత సాధించారు. ఎస్‌జీఎఫ్ఐ మండల స్థాయి పోటీల్లో వీరంతా గెలిచినట్టు బుధవారం హెచ్ఎం జేవైకే సత్యనారాయణ అన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ఎంపీపీ మల్లిబాబు, సర్పంచ్ సుబ్బరాజు, ఎస్ఎంసీ ఛైర్మన్ నాగలక్ష్మి అభినందించారు.


అప్పనరామునిలంకలో ప్రతిభ చూపిన విద్యార్థులతో టీచర్స్, ప్రజాప్రతినిధులు

ఏబీ స్విచ్ బాగు చేయండి

మలికిపురం: మండలంలోని లక్కవరంలో గూడపల్లి నంబర్ వన్ కాలువ వద్ద ఉన్న ఏబీ స్విచ్ కాలిపోయి సుమారు 4 నెలలైనా మరమ్మతులు చేయలే దని లక్కవరం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఆర్.గోపాలకృష్ణంరాజు అన్నారు. రాత్రి సమయంలో గూడపల్లి కాలువగట్టుపై కొబ్బరి చెట్లు ఎక్కువగా ఉండుట వలన వైరుకు ఆకులు తగిలినా, ఆకులు వైర్లపై పడినా తరచూ ట్రిప్ అవుతుందన్నారు. ఏబీ స్విచ్ పని చేస్తే, దీనికి ఓపెన్‌లో పెట్టి టౌన్ ఫీడర్ సప్లై ఇవ్వవచ్చని ఆయన పేర్కొన్నారు. అలాగే లక్కవరంలో పశువుల ఆసుపత్రి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి చాలా రోజులైందన్నారు. వెంటనే మరమ్మతులు చేయాలని విద్యుత్ శాఖ మండల ఏఈ ఎం.సతీష్‌ను కోరారు.


లక్కవరంలో పాడైన ట్రాన్స్‌ఫార్మర్

దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి

కొత్తపేట: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మాజీ అధ్యక్షుడు దీన్‌దయాళ్‌కు కొత్తపేటలో బీజేపీ నాయకులు ఘన నివాళులర్పించారు. బుధవారం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా మండల బీజేపీ అధ్యక్షుడు పాలాటి మాధవ స్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం ముఖ్యఅతిథిగా పాల్గొని ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సత్యానందం మాట్లాడుతూ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ రాష్ట్రీయ స్వయం సేవక్‌లో చేరి ప్రాదేశిక సహ ప్రచారక్ స్థాయికి ఎదిగారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టీచర్స్ సెల్ కన్వీనర్ ఇళ్ల సత్యనారాయణ, జిల్లా బీజేపీ కార్యదర్శి గొలకోటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కె.జగన్నాథపురంలో..

అయినవిల్లి: తత్వవేత్త, పాత్రికేయుడు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో జరిపారు. దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి వెంకటేశ్వరరావు, మల్లిబాబు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.


కొత్తపేటలో దీన్‌దయాళ్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ నేత పాలూరి

పి.గన్నవరం ఏఈగా వెంకటాచార్యులు



పి.గన్నవరం: ఏపీఈపీడీసీఎల్ పి.గన్నవరం సెక్షన్ ఏఈగా గెద్దనాపల్లి వెంకటాచార్యులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అమలాపురం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇంతవరకూ ఇక్కడ ఏఈగా పని చేసిన ఎస్.ఆనందరాజు అమలాపురం టౌన్ సెక్షన్‌కు బదిలీ అయ్యారు. ఏఈగా బాధ్యతలు స్వీకరించిన వెంకటాచార్యులుకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

కాలభైరవునికి అష్టమి పూజలు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయంలో కొలువైన కాలభైరవ స్వామివారికి బుధవారం అష్టమి పూజలు జరిపారు. ఆలయ ప్రధానార్చకుడు అల్లవరపు బాల సుబ్రహ్మణ్యశర్మ, సూరిబాబు ఆధ్వర్యంలో స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, వివిధ పూజలు జరిపారు. అష్టోత్తర శతనామావళి పూజలు, స్వామికి ఇష్టమైన గారెలు నైవేద్యంగా చెల్లించారు. స్వామిని వివిధ పుష్పాలతో అలంకరించారు. ఆలయ ఈఓ, ఏసీ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఈ పూజలు జరిపారు.


విశేషాలంకరణలో కాలభైరవస్వామి

అక్రమ ఆక్వా చెరువులను తొలగించాలి

రాజోలు: మండలంలోని చింతలపల్లి పరిసర ప్రాంతాల్లో అనుమతులు లేకుండా సాగు చేస్తున్న ఆక్వా చెరువులను తక్షణమే తొలగించాలని సీపీఐ కోనసీమ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం చింతలపల్లిలో చింతలపల్లి, ములికిపల్లి, వేగివారిపాలెం గ్రామ శాఖల పార్టీ కార్యకర్తల సంయుక్త సమావేశం జరిగింది. ఇందులో సత్తిబాబు, రాజేంద్ర ప్రసాద్ ముఖ్య అతిథులుగా మాట్లాడుతూ, రాష్ట్రంలో వెలికితీస్తున్న సహజ సంపదలో మన రాష్ట్రం వాటా మన రాష్ట్రానికే ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. చింతలపల్లి గ్రామ పార్టీ నూతన కమిటీని ఎంపిక చేశారు. నాయకులు మేడిచర్ల సత్యనారాయణ, పుల్లెల ఆనంద్, తాడి సత్యనారాయణ, వై.వెంకట్, ఉండ్రు శ్రీను పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం


దాతకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి పెదన గ్రామ వాస్తవ్యుడు కంతేటి శ్రీనివాస్‌కుమార్ దంపతులు బుధవారం రూ.10,116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులు వినాయకరావుకు అందజేశారు. దాతను స్వామివారి ఆశీర్వచనాలు అందజేసి, స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది అభినందించారు.

సేంద్రియ వ్యవసాయం వైపు దృష్టి సారించాలి

కొత్తపేట: వ్యవసాయ, ఉద్యాన పంటల సాగులో రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) పి.పద్మలత రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని వానపల్లిలో వ్యవసాయ పంటలు క్షేత్రస్థాయిలో పరిశీలన, రైతులకు ఆధునిక, సాంకేతిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఏఓ పద్మలత ఆధ్వర్యంలో స్థానిక వరి పొలాన్ని సందర్శించారు. అక్కడి రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో భాగంగా దేశీయ ఆవుపేడ మూత్రం, ఇంగువ ద్రావణం తయారుచేసే విధానం రైతులకు చూపించారు. ఇది తక్కువ ఖర్చుతో సమర్థవంతంగా వరి పంటను ఎండాకు తెగులు నుంచి రక్షించుకోవచ్చని ఏఓ సూచించారు. సాయంత్రం 4 గంటల తరువాత పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు. ఇంకా క్షేత్ర సమస్యలకు తక్షణ పరిష్కార చర్యలు, తక్కువ పెట్టుబడి–అధిక ఉత్పత్తి, అధిక ఆదాయం దిశగా రైతులను ప్రోత్సహించడం, సాంకేతిక వ్యవసాయ సమాచారం పరిజ్ఞానం, వ్యవసాయ, అనుబంధ శాఖల పథకాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లి భీమారావు, ఉప సర్పంచ్ గనిశెట్టి వీరేష్, పలువురు స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.


వానపల్లిలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ పద్మలత


శృంగవరప్పాడు కార్యక్రమంలో అధికారులు, రైతులు

వక్కలంక, మొసలపల్లిలో..

అంబాజీపేట: మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయానికి జోడిస్తే రైతులు మంచి లాభాలు పొందుతారని ఏడీఏ ఎస్‌జేవీ రామమోహనరావు అన్నారు. వక్కలంక, మొసలపల్లి గ్రామాల్లో సీహెచ్‌డీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సర్పంచ్ వాసంశెట్టి రేవతి అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీఏ రామమోహనరావు మాట్లాడుతూ ఈ పంట కార్యక్రమంలో ప్రస్తుత పరిస్థితుల్లో ఎండాకు తెగులు అధికంగా ఉన్న కారణంగా రైతులు నత్రజని ఎరువులు తగ్గించుకోవాలన్నారు. ఏవో విజయకుమార్ మాట్లాడుతూ రైతులు పండించే పంటను నమోదు చేయించుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల వలన నష్టం వాటిల్లితే నష్ట పరిహారం పొందే అవకాశం రైతులకు ఉంటుందన్నారు. పశువైద్యాధికారి దీపిక పశుగ్రాసాలు, వాటిలోని పోషణ విలువలు, వాటి ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నూకపెయ్యి సత్యనారాయణ, హార్టికల్చర్ ఏఓ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేశవదాసుపాలెం, శృంగవరప్పాడు గ్రామాల్లో

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెం, శృంగవరప్పాడు గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్‌లు మేడిద సరోజ, రావి నాగ వెంకట లక్ష్మీదేవి అధ్యక్షతన ఆయా గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఆధునిక సాగు పద్ధతులు, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందుటకు విధి విధానాలపై ఏవో పీవీ నరసింహారావు వివరించారు. అలాగే వెటర్నరీ, ఉద్యానశాఖ అధికారులు, రైతులకు పలు సూచనలు చేశారు. ఎంపీటీసీలు ఉండపల్లి సాయికుమారి, యెనుముల కొండమ్మ, వెటర్నరీ డాక్టర్ కె.సునీల్ గాంధీ, ఉద్యాన శాఖ, వ్యవసాయశాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు క్రీడాకారుల ఎంపిక


అంతర్వేదికర జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో బోధన సిబ్బంది

సఖినేటిపల్లి: అంతర్వేదికర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు క్రీడాకారులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ గేమ్స్‌లో ప్రతిభ చూపారని హెచ్ఎం పి.సోమ సూర్యకుమారి బుధవారం తెలిపారు. అండర్–14 లో కబడ్డీ విభాగంలో ఇద్దరు, ఖోఖో విభాగంలో ఒకరు, వాలీబాల్ విభాగంలో ముగ్గురు, వాలీబాల్ అండర్–17లో ముగ్గురు ఎంపికైనట్టు పీడీ కె.భాస్కరరావు అన్నారు. ఎంపికైన విద్యార్థులను సర్పంచ్ పోతురాజు నరసింహారావు, అభివృద్ధి కమిటీ చైర్మన్ పోతురాజు నాగేంద్రకుమార్, ఎస్ఎంసీ ఛైర్మన్ ఎ.శ్రీరాములు అభినందనలు తెలిపారు.

కరెంటు షాక్ బాధిత విద్యార్థినికి సాయం


గొందిలో బాధిత బాలిక తల్లిదండ్రులకు సాయం చేస్తున్న ఎంఈవో, సర్పంచ్

సఖినేటిపల్లి: మండలంలోని గొంది గ్రామంలో బుధవారం కరెంటు షాక్ బాధిత విద్యార్థిని బర్రె దుర్గా భవాని చికిత్సకు కువైట్ కేంద్రంగా ఉన్న జీసస్ హోప్ ఛారిటి రూ.50 వేలు నగదు సాయం చేసింది. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న భవానీ ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడింది. కాకినాడలో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికకు గాను ఈ మేరకు పై మొత్తాన్ని తల్లితండ్రులకు ఇంటి వద్ద ఎంఈవో డి.కిషోర్ కుమార్, సర్పంచ్ డి.రవికుమార్ చేతుల మీదుగా అందజేశారు. చారిటబుల్ సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.

ఎంఈఓ–1గా నాగకుమార్



రావులపాలెం: మండల విద్యాశాఖ అధికారి–1గా ఆర్.నాగకుమార్ బుధవారం అదనపు బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న డి.క్రిస్టఫర్ కర్నోలియస్ ఇటీవల రిటైర్డ్ కావడంతో ఖాళీగా ఉన్న ఆ స్థానంలోకి మండపేట హైస్కూల్‌కు చెందిన హెచ్ఎం నాగకుమార్ అదనపు బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. బాధ్యతలు చేపట్టిన ఆయనను ఎంఈఓ–2 శ్రీనివాసరాజు, ఇతర ఆఫీస్ సిబ్బంది అభినందించారు.

గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ప్రాధాన్యం

సఖినేటిపల్లి: గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. బుధవారం అంతర్వేదికర పంచాయతీ వద్ద సర్పంచ్ పోతురాజు నరసింహారావు అధ్యక్షతన కూటమి ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాద్ ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజావేదిక సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఎన్డీఏ ప్రభుత్వం పేదల అభ్యున్నతికి కట్టుబడి ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరావు, డీటీ సీహెచ్ భాస్కర్, ఎంపీటీసీ చొప్పల బాబూరావు, గుబ్బల ఫణి, గుండుబోగుల పెదకాపు పాల్గొన్నారు.

అందరూ భాగస్వాములు కావాలి

కొత్తపేట: సీఎం చంద్రబాబు ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్ర-2047 విజన్‌కు అందరూ భాగస్వాములు కావాలని తహసీల్దార్ వై.రాంబాబు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో విద్యార్థులకు అవగాహనలో భాగంగా బుధవారం స్థానిక సిద్ధార్థ జూనియర్, శతాబ్ది డిగ్రీ కళాశాలల సముదాయంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ అధ్యాపకురాలు సీహెచ్ భవాని ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ కేపీ రాజు అధ్యక్షతన స్వర్ణాంధ్ర-2047 విజన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ కొప్పిశెట్టి ఏడుకొండలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కారుమబ్బులు కమ్మిన వేళ..


అంబాజీపేటలో కారుమబ్బులు కమ్మిన దృశ్యం

అంబాజీపేట: ఒక పక్క భారీ వర్షం... మరో పక్క కారుమబ్బులు కమ్మిన వేళ ఆకాశం అంతా నల్లటి మేఘాలతో బుధవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో దర్శనమిచ్చిన వాతావరణం ప్రకృతి ప్రేమికులను ఆనందింప చేసింది. అంబాజీపేటలో బుధవారం అర్ధరాత్రి నుంచి వర్షం కురిసింది. కారుమబ్బులకు, భారీ వర్షానికి దారి కనిపించక వాహనదార్లు లైట్లు వేసుకుని వెళ్లాల్సి వచ్చింది. వారపు సంత కావడంతో వర్షానికి చిరు వ్యాపారులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానిక జెడ్పీ హైస్కూల్, బస్టాండ్ వర్షపు నీటితో నిండిపోయింది.